క్లుప్తంగా

జిల్లాలో అసంపూర్తిగా 21,584 ఇళ్ల నిర్మాణాలు



పశివేదలలో మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ పీడీ భాస్కర్‌రెడ్డి

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా 21,584 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.భాస్కర్‌రెడ్డి ప్రకటించారు. ఇంటి నిర్మాణం కోసం అందిస్తున్న అదనపు సాయాన్ని గృహనిర్మాణ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. బుధవారం ఆయన మండలంలో పశివేదలలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల నిర్మాణ పనులకు ఆయన పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ సంస్థ గ్రామ, మండలస్థాయి అధికారులు లబ్ధిదారులను కలసి అవగాహన కల్పించాలని సూచించారు.అసంపూర్తి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తుందన్నారు. ఎంపీడీవో కె.సుశీల,డిప్యూటీ ఈఈ శేఖర్ బాబు, గృహనిర్మాణ సంస్థ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

బడ్డీ దుకాణాల తొలగింపు



బడ్డీ కొట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిడదవోలు: పట్టణంలో ప్రధాన సెంటర్లలో రోడ్డుకి ఇరువైపులా ఆక్రమించి అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యాపారులపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారి సుప్రియ తన సిబ్బందితో కలసి బుధవారం అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటర్ నుంచి గణపతి జంక్షన్ వరకు ఇరువైపులా రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీ కొట్లు, టెంట్లు, ఇతర సామగ్రిని తొలగించారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజల సౌకర్యార్థం ఈ చర్యలు చేపట్టినట్లు కమిషనర్ కృష్ణవేణి స్పష్టం చేశారు. రోడ్లపై అనధికారంగా వ్యాపారం చేస్తున్న వారు మున్సిపల్ సిబ్బందికి సహకరించి, స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని కమిషనర్ కోరారు.

వైస్ చాన్సలర్‌ను కలిసిన అధ్యాపకులు

నిడదవోలు: రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీని బుధవారం నిడదవోలు ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశాల ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్రతో పాటు అధ్యాపకులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ మాట్లాడుతూ కళాశాల అకాడమిక్ ప్రయత్నాలను, న్యాక్ బి ప్లస్ ప్లస్ గ్రేడు సాధించినందుకు ప్రశంసించారు. కళాశాల అభివృద్ధికి విశ్వవిద్యాలయం నుంచి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అధ్యాపకులు లావణ్య, కె. సుమలత, పి.ఉషారాణి, ఎ. శ్రీలక్ష్మీ, భ్రమరాంబ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఉండ్రాజవరం: భార్య కేసు పెట్టడంతో మనస్థాపం చెందిన భర్త పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో పాలంగిలో చోటు చేసుకుంది. ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో పాలంకి చెందిన ఉండ్రాజవరపు కిరణ్‌కుమార్ (47) 16 ఏళ్ల క్రితం విజయవాడకు చెందిన మంజుతో వివాహమైంది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పెళ్లయిన కొంత కాలానికి ఉద్యోగం నిమిత్తం కిరణ్‌కుమార్ సింగపూర్ వెళ్లాడు. మధ్యలో తరచూ ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వచ్చిన గొడవల నేపథ్యంలో భార్య మంజు భర్త కిరణ్‌కుమార్‌పై మూడు కేసులు పెట్టింది. దాంతో కిరణ్ ఉద్యోగం మానేసి తండ్రి వద్దనే ఉంటూ కోర్టు వాయిదాలకు హాజరవుతున్నాడు. భార్య పెట్టిన కేసులకు మనస్థాపం చెంది మంగళవారం పురుగు మందు తాగి కిరణ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఉండ్రాజవరపు సోవులురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై కె.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్ట్ అనంతరం మృతదేహాన్ని బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

23న మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 23న ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు విధిగా సమావేశానికి రావాలని ఆయన పేర్కొన్నారు.

ఇసుక ర్యాంపుల్లో అక్రమ డ్రెడ్జింగ్

- వేగేశ్వరపురం ఓపెన్ ర్యాంపులో ఇసుక లేని వైనం
- ర్యాంపుల్లో అధికార పార్టీ నాయకుల హవా
- నదీ గర్భంలో డ్రెడ్జింగ్ కోసం బాటల నిర్మాణం



వేగేశ్వరపురం ఓపెన్ ఇసుక ర్యాంపులో డ్రెడ్జింగ్ కోసం వేసిన బాటలు



డ్రెడ్జింగ్ చేయడానికి తీసుకు వచ్చిన బోట్, పొక్లెయిన్



బల్లిపాడు ర్యాంపులో ఇసుక కోసం తవ్విన ప్రదేశాలు

తాళ్లపూడి: ఇసుక ర్యాంపుల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు హవా కొనసాగుతోంది. ఒక పక్క పేదలకు ఇళ్ల నిర్మాణానికి ఉచిత ఇసుకను అందిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించి ఇసుక ర్యాంపులను ప్రారంభించారు. ఓపెన్ ర్యాంపులో ఇసుక లేని వింత పరిస్థితి నెలకొంది. ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై ఉచిత ఇసుకను తెచ్చుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, మరో పక్క కూలీలతోనే లోడింగ్ చేసి వారికి పని కల్పించాలనే నిబంధనలున్నా ఇవి ర్యాంపుల్లో అమలు కావడం లేదు. బాట పేరుతో ట్రాక్టర్ల వద్ద సొమ్ము వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో సాగిన ఇసుక దందా మళ్లీ మొదలైంది. పేదలకు ఉచితంగా ఇసుక అందిస్తామన్న ప్రభుత్వ హామీ ఏమాత్రం నేరవేరడం లేదు. మండలంలోని బల్లిపాడు వద్ద గల వేగేశ్వరపురం ఓపెన్ ఇసుక ర్యాంపును అధికార పార్టీకి చెందిన టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నడుపుతున్నారు. ఇక్కడ ఇసుక టన్ను రూ.69.76 విక్రయించాలి. ఇక్కడే మరో ర్యాంపును చిడిపిలో ఏర్పాటు చేశారు. ఈ ర్యాంపుల్లో ట్రాక్టర్లలో కూలీలతో లోడింగ్ చేయించి స్టాక్ పాయింట్‌కు చేర్చాలి. ఇక్కడ ఇది అమలు కావడం లేదు. కూలీలకు పని కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. మంగళవారం రాత్రి మైనింగ్ అధికారులు దాడి చేసి డ్రెడ్జింగ్ బోట్, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

అసలు ఇసుక ఎక్కడిది

ఓపెన్ ఇసుక ర్యాంపులో ఇసుక అందుబాటులో లేదు. ర్యాంపులో గతంలో వేసిన బాటలు రాళ్లతో కూడి ఉండడంతో ఇసుక నాణ్యంగా లేదనే ఆరోపణలున్నాయి. ఇక్కడ ఇసుకలో మట్టి ఎక్కువగా వస్తోంది. దీంతో ఇసుక ర్యాంపు నిర్వాహకులు గోదావరిలో రాత్రి సమయాల్లో ఇసుకను డ్రెడ్జింగ్ పడవల ద్వారా ఒడ్డుకు తీసుకుని వచ్చి యంత్రాలు సాయంతో లారీల్లో స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నారు. ఓపెన్ ర్యాంపులో డ్రెడ్జింగ్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ర్యాంపులో ఇసుక లేకుండా అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

గోదావరిలో యథేచ్ఛగా బాటలు

గోదావరిలో ఇసుక తీసుకురావడానికి సుమారు మూడు కిలోమీటర్లు వరకు సత్రుతో బాటలు వేసి అక్కడి నుంచి ఇసుకను తీసుకువస్తున్నారు. గతంలో నదీ గర్భంలో బాటలు వేయడంతో ప్రస్తుతం ఇసుక లేని పరిస్థితి నెలకొంది. దీంతో ర్యాంపు నిర్వాహకులు మాత్రం తమ వ్యాపారం కోసం అక్రమ డ్రెడ్జింగ్‌పై ఆధారపడుతున్నట్టు సమాచారం. నదీ గర్భంలో బాటలు వేయడానికి అసలు అనుమతి ఉందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మీటర్ రీడింగ్ సిబ్బందికి ఉపాధి కరవు



పెరవలిలో ఎలక్ట్రికల్ డీఈ నారాయణ అప్పారావుకి వినతిపత్రం అందిస్తున్న వైవీ ప్రసాద్, నాయకులు

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయటం వల్ల ఉపాధి కోల్పోతున్నామని, 23 ఏళ్లుగా ఈ సంస్థనే నమ్ముకుని చాలీచాలని జీతాలతో మనుగడ సాగిస్తున్న మాకు ఉపాధి కల్పించాలని మీటర్ రీడింగ్ యూనియన్ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. నిడదవోలు డివిజన్ పరిధిలోని ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు, గోపాలపురం, చాగల్లు మండలాల విద్యుత్ మీటర్ల రీడింగ్ యూనియన్ నాయకులు బుధవారం నిడదవోలు డీఈ నారాయణ అప్పారావుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా యూనియన్ సెక్రటరీ వైవీ ప్రసాద్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల తమ జీవితాల్లో చీకటి అలుముకోనుందని, ప్రత్యామ్నాయంగా విద్యుత్ సంస్థలోనే ఉపాధి కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ ఉపాధ్యక్షుడు పి జాకబ్, సహాయ కార్యదర్శి బి స్వామి, పెరవలి, ఉండ్రాజవరం, గోపాలపురం, నిడదవోలు, చాగల్లు మండలా యూనియన్ నాయకులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

31వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలి

నిడదవోలు రూరల్: రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈనెల 31వ తేదీలోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. 6 నుంచి 60 ఏళ్లలోపు వారంతా సంబంధిత రేషన్ డిపో డీలర్, వీఆర్వో దగ్గరకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈకేవైసీ పూర్తిచేయకపోతే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ రేషన్ సరుకులను కార్డుదారులకు నిలుపుదల చేస్తామన్నారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

నిడదవోలు: పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటర్‌లో ఉన్న అన్నా క్యాంటీన్‌ను బుధవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధికారులతో కలసి పరిశీలించారు. ఆహారం నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అక్కడే భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రణాళికతో భూముల రీ సర్వే

కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత



కురుకూరులో భూముల రీ సర్వే రికార్డులను పరిశీలిస్తున్న కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత

దేవరపల్లి: కురుకూరులో సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో కూడిన భూముల రీ సర్వే చేపడుతున్నట్టు కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత తెలిపారు. గతంలో గ్రామంలో జరిగిన భూముల రీ సర్వేపై రైతుల నుంచి వచ్చిన పలు అభ్యంతరాల నేపథ్యంలో సీసీఎల్ఏ కమిషన్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై రైతులు, భూ యజమానులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో భూముల రీ సర్వే నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. భూ యజమానులు, రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో కూడిన భూముల రీ సర్వే చేయనున్నట్టు ఆమె తెలిపారు. క్షేత్రస్థాయి తనిఖీలు, రీ సర్వేలో తగిన వివరాలు అందజేసి అధికారులకు, క్షేత్రస్థాయిలో సిబ్బందికి సహకరించాలని ఆమె రైతులను కోరారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, సర్వే అధికారులు, సర్వే బృందం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తొలి సంతకం ఏమైంది బాబూ?

వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు యువరాజు



నల్లజర్ల: తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్‌పైనే అంటూ ఆర్భాటంగా ప్రకటించిన సీఎం చంద్రబాబు అధికారం చేపట్టి తొమ్మిది నెలలైనా ఇంతవరకు నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారే తప్ప నేటికీ ఒక్క ఉద్యోగం కూడ భర్తీ చేయలేదని వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మేణ్ణి యువరాజు ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన నల్లజర్లలో విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగులు కోచింగ్‌ల కోసం లక్షలాది రుపాయలు ఖర్చు చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నాలుగు లక్షల ఉద్యోగాలను కల్పించారని గుర్తు చేశారు. వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని డిగ్రీలు, పీజీలు, టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన లక్షలాది మంది నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక రోడ్డున పడ్డారన్నారు.

పదో తరగతి హిందీ పరీక్షకు 666 మంది హాజరు



వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పరిశీలిస్తున్న సీఐ విజయబాబు, ఎస్సై తదితరులు

తాళ్లపూడి: మండలంలోని పదో తరగతి పరీక్షల్లో మొత్తం 676 మంది విద్యార్థులకు 666 మంది బుధవారం హిందీ పరీక్షకు హాజరైనట్టు ఎంఈవో 2, రూట్ ఆఫీసర్ సీహెచ్ నెహ్రూజీ తెలిపారు. పది మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదు. తాళ్లపూడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 131 మందికి 129 మంది, వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 260 మందికి 254 మంది, మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం–ఎలో 150 మందికి 148 మంది, పరీక్షా కేంద్రం–సీలో 135 మంది పరీక్షలకు హాజరయ్యారని ఆయన తెలిపారు. వేగేశ్వరపురం పరీక్షా కేంద్రాన్ని కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు, ఎస్సై టి.రామకృష్ణ పరిశీలించారు.

27 మంది గైర్హాజరు

దేవరపల్లి: మండలంలోని ఐదు కేంద్రాల్లో బుధవారం జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షకు 27 మంది గైర్హాజరు అయినట్టు ఎంఈఓ ఎం.తిరుమలదాస్ తెలిపారు. దేవరపల్లి జెడ్పీ హైస్కూలు కేంద్రంలో ఐదుగురు, శ్రీచైతన్య కేంద్రంలో 8 మంది, భాష్యం స్కూలు కేంద్రంలో 11 మంది, యర్నగూడెం జెడ్పీ హైస్కూలు కేంద్రంలో ఇద్దరు, చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూలు కేంద్రంలో ఒకరు పరీక్షకు హాజరు కాలేదని ఆయన తెలిపారు. మండలంలో 1,022 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా, 995 మంది హాజరైనట్టు ఆయన తెలిపారు.

చాగల్లు: పదో తరగతి పరీక్షలు ప్రశాంతం కొనసాగుతున్నాయి. చాగల్లు మండల పరిధిలోని చాగల్లు, ఊనగట్ల, మార్కొండపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు జరిగిన హిందీ పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ యు.గురునాథం తెలిపారు. మండల పరిధిలో 374 మంది విద్యార్థులకు 369 మంది హాజరైనట్లు చెప్పారు. చాగల్లు జెడ్పీ హైస్కూల్లో పరీక్ష సెంటర్‌ను కొయ్యలగూడెం డీవైఈఓ రామస్వరూప తనిఖీ చేశారు.

21మంది గైర్హాజరు

కొవ్వూరు: మండలంలో బుధవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండల వ్యాప్తంగా 1,273 విద్యార్థులకు 1,252 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. కొవ్వూరు పీఎంఎం హైస్కూల్లో ఆరుగురు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇద్దరు, దీప్తి, భాష్యం హైస్కూళ్లలో ఐదుగురు చొప్పున, వాడపల్లి హైస్కూల్లో ఒకరు పరీక్షకి గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పీబీవీ రమణ

కొవ్వూరు: మండల పరిషత్ ఇన్‌చార్జ్ ఎంపీడీవో (ఎఫ్ఏసీ)గా పీబీవీ రమణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కె.సుశీల సామర్లకోట ఈటీసీకి బదిలీ అయ్యారు. ఈమేరకు ఆమె బుధవారం రిలీవ్ కావడంతో ఆమె స్థానంలో రమణ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తాళ్లపూడి ఎంపీడీవోగా పనిచేస్తున్న రమణకు కొవ్వూరులో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన్ను మండలంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన రమణకు పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల హర్షం

నిడదవోలు: వ్యోమగామి సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమికి చేరిన సందర్భంగా స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు కేరింతలతో హర్షధ్వానాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ సమాజాభివృద్ధికి సైన్స్ మూలాధారమన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన కోరారు.

గొడుగుల పంపిణీ

కొవ్వూరు: రోడ్డు మార్జిన్‌లో చిరువ్యాపారులకు రాజమహేంద్రవరం స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు గుబ్బల రాంబాబు బుధవారం గొడుగులకు పంపిణీ చేశారు. పట్టణంలో ప్రభుత్వ కళాశాల సెంటర్‌లో కొబ్బరి బొండాలు, పూలు, పండ్లు విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకునే చిరు వ్యాపారులకు వీటిని అందజేశారు. కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ, పాలంకి రాంబాబు, వి.సతీష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

దేవరపల్లి: గోపాలపురం మండలంలోని గ్రామాలను డయేరియా వ్యాధి చుట్టుముట్టడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దేవరపల్లిలోని పంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలోని మంచినీటి ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్, పూడుకుపోయిన డ్రైనేజీల్లోని పూడికతీసి బయటకు తరలించడం, రోడ్ల వెంబడి ఉన్న చెత్త కుప్పలను బుధవారం తొలగించారు. సర్పంచ్ కడిమి వీర కుమారి పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్ పారిశుధ్య పనులను వేగవంతం చేశారు. పంచాయతీ పరిధిలో 5,178 గృహాల్లో 4,100 డస్ట్‌బిన్లు అందజేశారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



దేవరపల్లిలో ఉచిత కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

దేవరపల్లి: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరంకు చెందిని అకిరా కంటి హాస్పిటల్ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన శిబిరంలో 50 మంది విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సౌకర్యార్థం కంటి, పంటి, గుండె సంబంధితమైన, డయాబెటిస్, ఆర్థోపెడిక్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ఆయన తెలిపారు. విశ్రాంత ఉగ్యోగులంతా అసోసియేషన్ సేవాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. అవసరమైన వారు కంటి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ కార్డుపై చేయించుకోవచ్చునని ఆయన తెలిపారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ ఎ. రమేష్, పీఆర్వో కె. నారాయణరావు, టెక్నిషియన్ పి. సురేష్, అసోసియేషన్ మండల అధ్యక్షులు పప్పు వెంకటరామారావు, కోశాధికారి గద్దె కృష్ణారావు,, గౌరవాధ్యక్షులు కేశిరాజు సీతారామయ్య, సయ్యద్ ఆలీసాహెబ్, యలమాటి సత్యనారాయణ, ఆచంట జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోలకు పోలీసు సెక్యూరిటీ కోడ్ నంబర్లు



కొవ్వూరులో ఆటోవాలకు టీఆర్ పోలీసు సెక్యూరిటీ నంబర్ స్టిక్కర్లు అందజేస్తున్న సీఐ విశ్వం

కొవ్వూరు: జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు కొవ్వూరు పట్టణ పోలీసులు ఆటోలకు బుధవారం పోలీసు సెక్యూరిటీ కోడ్ నంబర్లను అతికించారు. పట్టణ వ్యాప్తంగా తిరుగుతున్న ఏడు ఆటో యూనియన్లను చెందిన 150 ఆటోలకు వీటిని అంటించనున్నట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఆటో యజమాని పేరు, డ్రైవర్ పేరు, ఫోన్ నంబర్లు, ఆటో స్టాండ్ ఏరియా వివరాలతో కూడిన స్టిక్కర్లను అతికించారు. వీటిపై స్థానిక పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, డీఎస్పీ ఫోన్ నంబర్లను సైతం ఏర్పాటు చేశారు. ప్రయాణికులు వారు ప్రయాణిస్తున్న ఆటో టీఆర్ నంబర్‌ను గుర్తించుకోవాలన్నారు. ఇబ్బందులు తలెత్తిన సమయంలో పోలీసు సహకారం తీసుకునేందుకు వీలుగా ప్రతి ఆటోపై స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.